ముగిసిన పది పరీక్షలు

కడ్తాల్ : మండల కేంద్రంలో పరీక్షలు ముగిసిన అనంతరం విద్యార్థుల కేరింతలు.

- పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కేరింతలు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 30: పదో తరగతి వార్షిక పరీక్షలు షాద్‌నగర్ పట్టణంలో శనివారం ప్రశాంతంగా ముగిశాయి. 2309 మంది విద్యార్థులకు 2296 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో శంకర్‌రాథోడ్ తెలిపారు. పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

కడ్తాల్ : మండలంలో పన్నెండు రోజులుగా నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతోపాటు, ముద్విన్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. 509 విద్యార్థులకు ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈవో సర్దార్‌నాయక్ తెలిపారు.

టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

- వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ
- పాల్గొన మంత్రి శ్రీధర్‌బాబు, హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామిజీ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠాపన భూమి పూజలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, మార్చి 30 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పరిగూడ ఎక్స్‌రోడ్డు వద్ద హరిహర అఖండ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన 108 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు నిర్వహించిన భూమి పూజలో శనివారం మంత్రి శ్రీధర్‌బాబు, హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామిజీ, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. హరిహర అఖండక్షేత్రం నిర్వాహకులు సదావెంకట్‌రెడ్డి గొప్ప సంకల్పంతో ఇక్కడ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనుండటం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ ఆలయ నిర్మాణం కోసం ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు కూడా అందిస్తామన్నారు. చెరువుకట్టతో పాటు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న ప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆంజనేయస్వామి వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, జడ్పీటీసీ మహిపాల్, టీపీసీసీ కార్యదర్శి చిలుకల మధుసూదన్‌రెడ్డి, ధర్మ జాగరణ సమితి సభ్యులు లింగన్న, కౌన్సిలర్ సునిత, సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే సమాజంలో గౌరవం

ఎంపీడీవో ఫారుక్‌హుస్సేన్‌ను సన్మానిస్తున్న మండల పరిషత్ అధికారులు, సిబ్బంది

ఆమనగల్లు, మార్చి 30 : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యవారధిగా ఉంటూ ప్రజలకు అందించిన సేవలతోనే సమాజంలో అధికారులకు గుర్తింపు ఉంటుందని కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు అన్నారు. ఆమనగల్లు ఎంపీడీవో ఫారుఖ్‌హుస్సేన్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆమనగల్లులోని ఓ కల్యాణ మండపంలో శనివారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఫారుక్ హుస్సేన్ 30 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా వివిధ హోదాల్లో ప్రభుత్వ అధికారిగా పనిచేసి ప్రజల ప్రశంసలు పొందారని ఆయన గుర్తు చేశారు. అనంతరం దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆమనగల్లు తహసీల్దార్ లలిత, కల్వకుర్తి, తలకొండపల్లి, మాడ్గుల, వంగూర్, నందిగామ, చేవెళ్ల, కేశంపేట, జడ్చర్ల, బాలనగర్ ఎంపీడీవోలు వెంకట్రాములు, శ్రీకాంత్, సరస్వతి, విజయభాస్కర్, సుమతి, హిమబిందు, రవిచంద్రారెడ్డి, బాల్‌రెడ్డి, శరత్‌చంద్రబాబు, ఇన్‌చార్జి ఎంఈవో సర్దార్‌నాయక్, ఎస్సీ కార్పొరేషన్ సూపరింటెండెంట్ గణపతి, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ కృష్ణయ్య పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్నవారిని ఆదుకుంటాం

ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు, ట్రస్ట్ సభ్యులు

కడ్తాల్, మార్చి 30 : కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పోతుగంటి ఆంజనేయులు ఇటీవల ప్రమాదానికి గురై కాలుకి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ శనివారం ఉదయం బాధితుడికి ట్రస్ట్ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్‌యాదవ్, నాయకులు శేఖర్, మల్లేశ్‌యాదవ్, మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం : ఆర్డీవో

చేవెళ్లలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో సాయిరాం

చేవెళ్లటౌన్, మార్చి 30: ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం అన్నారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో తహసీల్దార్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కోసం 5కే రన్, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ..18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల సీఐ లక్ష్మా రెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఐ రాజేశ్, అతెల్లి అనంతరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంబోత్‌తండాలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సక్రియానాయక్

దరఖాస్తుదారులకు పని కల్పించాలి

మంచాల, మార్చి 30 : ఉపాధిహామీ పథకంలో పనికోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి కూలీకి పని కల్పించాలని ఇబ్రహీంపట్నం క్లస్టర్ ఏపీడీ సక్రియానాయక్ అన్నారు. శనివారం మండలంలోని రంగాపూర్, బోడకొండ, లోయపల్లి, ఆంబోత్‌తండా తదితర గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించారు. అనంతరం కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధిలో పనిచేసే కూలీలకు కొలతల ప్రకారం డబ్బులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. వేసవి కాలంలో పనులు జరిగే ప్రాంతంలో తాగునీటి వసతి కలిపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో వీరాంజనేయులు, ఉపాధి సిబ్బంది యాదయ్య, ప్రభాకర్, జంగమ్మ, పంచాయతీ కార్యదర్శులు శోభారాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తాం

సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పాండురంగారెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 30 : ఉప్పరిగూడ సహకార సంఘం పరిధిలోని రైతులకు గతంలో కంటే మెరుగైన సేవలందిస్తామని ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకవర్గం చేసిన అభివృద్ధి కంటే రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. సీతారాంపేట్ సమీపంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రైస్‌మిల్లు నిర్మాణాన్ని త్వరలోనే పూర్తిచేసి వెంటనే ప్రారంభిస్తామన్నారు. ఈ రైస్‌మిల్లులో సహకారసంఘం పరిధిలోని రైతులు పండించిన ధాన్యాన్ని పట్టించుకుని లబ్ధిపొందేలా కృషి చేస్తామన్నారు. గతంలో సహకార సంఘంలో అధ్యక్షుడిగా పనిచేసిన గురునాథ్‌రెడ్డి, పోరెడ్డి నర్సింహారెడ్డిలను సన్మానించారు. సమావేశంలో సీఈవో గణేశ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

యాచారం, మార్చి30: మండల కేంద్రంలోని తిరుమలేశుని గుట్టపై కొలువుదీరిన తిరుమలనాథ స్వామి కల్యాణ మహోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గుట్ట పరిసరాలు గోవిందనామ స్మరణతో మారుమ్రోగాయి. స్వామివారి సేవలో తరించి భక్తి పారవశ్యంలో మునిగితేలారు. స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 30 : ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశిరావు, పూజారి రమేశ్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన మెడికల్ బిల్లులు, సరెండర్ బిల్లులు టీఎస్ జీఎల్ఐ మెచ్యూరిటీ, జీపీఎఫ్‌లోన్లు పీఆర్సీ ఏరియార్స్, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. రేపటితో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ప్రభుత్వం స్పందించాలని కోరారు.



చేవెళ్లలోని మల్లన్న స్వామి దేవాలయ పుననిర్మాణానికి మాజీ ఎంపీపీ మంగళి బాల్‌రాజు స్టీలు మొత్తం ఇప్పిస్తానని చెప్పడంతో అతడిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

– చేవెళ్లటౌన్, మార్చి 30

విగ్రహ ఏర్పాటుకు విరాళం

కడ్తాల్, మార్చి 30 : మండల పరిధిలోని చరికొండ గ్రామంలోని యువ క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.10 వేల విరాళాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, అశోక్, యువ క్రాంతి యువజన సంఘం అధ్యక్షుడు యాదయ్య, సభ్యులు రమేశ్, కృష్ణ, మహేందర్, జంగయ్య, భాషా, శ్రీశైలం, పెద్దయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

హయత్‌నగర్, మార్చి 30 : ఆర్టీసీ హయత్‌నగర్ డిపో-1, డిపో-2లల్లో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు డిపో-1 మేనేజర్ విజ య్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హయత్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రయాణికులు, ప్రజ లు తమ విలువైన సలహాలు, సూచనలు హయత్‌నగర్ డిపో-1 మేనేజర్ నంబర్ 9959226138, డిపో-2 మేనేజర్ నంబర్ 9959 226419లో సంప్రదించాలన్నారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

మాదన్నపేట, మార్చి 30: యువకుడి పై అకారణంగా ముగ్గురు మైనర్లు దాడి చేసి గాయపరచిన సంఘటన సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీఆర్‌డీఎల్ చౌరస్తా వద్ద ఉప్పుగూడ బస్తీకి చెందిన కౌశిక్ ఫంక్షన్ పూర్తి చేసుకొని వెళుతుండగా అకారణంగా ముగ్గురు బాలురులు దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి ముగ్గురు బాలురులను జువైనల్ హోం కు తరలించామని తెలిపారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం

ఎల్బీనగర్ , మార్చి 30: ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయంలోని జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే కీలకమైన విభాగంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో నడిపిస్తున్నారు. ఈ విభాగంలో మొత్తం ఏడుగురు ఉద్యోగులు ఉన్నారు. వీరిపై ఏఎంసీలను నియమించినప్పటికీ వారు ఈ విభాగంపై అజామాయిషీ చేసేంత పరిస్థితి కన్పించడం లేదు. ఈ విభాగంలో పర్మినెంట్ ఉద్యోగులను నియమిస్తే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కావని స్థానికులు అంటున్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి,తదితరులు

వనస్థలిపురం, మార్చి 30 : ప్రజలంతా వారి సంస్కృతులకు అనుగుణంగా ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. టీచర్స్ కాలనీ ఫేజ్3 కాలనీలో ఉన్న శ్రీగిరి కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గణపతి, సరస్వతి, ధ్యానాంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవాలలో శనివారం ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కబ్జాలపై కేఎల్ ఆర్ మాట్లాడటం హాస్యాస్పదం

మాట్లాడుతున్న నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ

ఆర్కేపురం, మార్చి 30 : మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి గురించి మాట్లాడే స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేఎల్ఆర్‌ది కాదని, కబ్జాల గురించి ఆయన మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. శనివారం ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులే పార్టీ గేట్లు ఓపెన్ చేశామని పదే పదే అంటూ ఇతర పార్టీల నాయకులను చేర్చుకుంటున్నారని తెలిపారు. మీరు గేట్లు తెరిచినా మూసుకున్న సబితాఇంద్రారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రసక్తేలేదన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయానా ఎమ్మెల్యేల, ఎంపీల ఇంటివద్దకు వెళ్లి పార్టీలో చేరాలని అడగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఓ ముఖ్యమంత్రి ఇంతలా దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. తమ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల మీద నమ్మకం లేకనే బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ఎంపీలను తమ పార్టీలో చేర్చుకుంటున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటలకు కట్టుబడి సబితాంద్రారెడ్డి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ మహేశ్వరం నియోజకవర్గాన్ని వేల కోట్లతో అభివృద్ధి చేసిందన్నారు. ప్రజలకు సేవ చేయాలంటే అధికార పార్టీలో ఉండాల్సిన అవసరం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తలకిందులు చేసి పోర్లు దండాలు పెట్టిన సబితాఇంద్రారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరదన్నారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లే సబితాఇంద్రారెడ్డి పార్టీలోకి వస్తుందని, ఆమె కోసం జిల్లాలో మంత్రి పదవిని ఆపుతున్నారని సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంపై ఎలాంటి అవగాహన లేని వారు కూడా నియోజకవర్గం గురించి మాట్లాడటం సరికాదన్నారు. సబితాఇంద్రారెడ్డిపై అసత్య ఆరోపణలు, అవినీతి ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల శేఖర్,జగన్మోహన్ రెడ్డి, దుబ్బాక శేఖర్, మహ్మద్ షఫీ, అల్లావుద్దీన్‌పటేల్, పాషా పాల్గొన్నారు.

వరదనీటి కాలువ మళ్లింపుపై ప్రత్యేక సమావేశం

వాటర్‌లైన్ అవుట్‌లెట్‌పై చర్చిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి,మున్సిపల్ అధికారులు

హయత్‌నగర్, మార్చి 30 : హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వనస్థలిపురం ఈస్ట్రన్ కాలనీల నుంచి హైకోర్టు కాలనీ, జగదాంబ కాలనీల మీదుగా వెళ్లే వరదనీటి కాలువకు అవుట్‌లెట్ నిర్మాణం కోసం నిధులు మంజూరై కాలం గడుస్తున్నప్పటికీ కాలువ నిర్మాణంపై ప్రైవేట్ ల్యాండ్ యజమానులు నిరాకరించడంతో శనివారం స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగం, స్థానిక కాలనీవాసులతో కలిసి హైకోర్టు కాలనీలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పావని, డీఈ దామోదర్‌రావు, ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, ఈస్ట్రన్ కాలనీ అధ్యక్షుడు దీపావళి శ్రావణ్, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

మండలంలోని తాటిపర్తి గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వీధి నాటకాన్ని శుక్రవారం రాత్రి ప్రదర్శించారు. ఆధునిక కాలంలోనూ అలనాటి వీధినాటకం చూపరులను ఎంతగానో అలరించింది. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్రను కళ్లకు కట్టినట్లు కళాకారులు ప్రదర్శించారు.

– యాచారం, మార్చి 30

ప్రభుత్వ భూములను కాపాడాలి

కమిషనర్ రఘుకు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

బడంగ్‌పేట, మార్చి30: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్ 153లో బట్టేల్ గుట్టను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాలాపూర్ తాసీల్దార్, మేయర్, కమిషనర్ రఘుకు శనివారం గట్ట శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. 153 సర్వే నంబర్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయానికి కొంత స్థలాన్ని కేటాయించగా అప్పటి సర్పంచ్ సూర్ణ గంటి అర్జున్ అందులో కొంత భాగాన్ని ఆయన అన్నకు ఇవ్వడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రి నుంచి కలెక్టర్ వరకు ఫిర్యాదు చేశామన్నారు. అప్పట్లో అక్రమ నిర్మాణాలను నిలిపివేశారన్నారు. ఇటీవల కబ్జాల పర్వం కొనసాగుతున్నాయని అన్నారు. గతంలో నిలిపివేసిన నిర్మాణాన్ని 30వ డివిజన్ కార్పొరేటర్ భీమిడి స్వప్నారెడ్డి భర్త భీమిడి జంగారెడ్డి ప్రభుత్వ స్థలంలో కొన్ని అక్రమ కట్టడాలు చేపడుతున్నారన్నారు. ఆ నిర్మాణాలను నిలిపివేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

వనస్థలిపురం, మార్చి 30 : 'బల్దియా ఆదాయానికి గండి' శీర్షికన గురువారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైన విషయం విధితమే. కథనానికి స్పందించిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. సాగర్ కాంప్లెక్స్ శ్రీపురం కాలనీ సమీపంలో నిర్మిస్తున్న షెడ్డును కూల్చివేశారు. కాగా టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తీరుపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణాలు ప్రారంభ దశలో ఉన్నప్పుడు చోద్యం చూస్తున్నారని, పూర్తయ్యే దశలో కూల్చివేతలు చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పత్రికల్లో వార్తలు, ఫిర్యాదులు చేస్తే తప్ప పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.